# మానస వీణ

**ఆదివారం.** హైదరాబాద్ మెగాసిటీ. అబిడ్స్ సెంటర్. ఫుట్‌పాత్ గుండెలమీద పాత పుస్తకాలు పొరాడుతున్నై. అమ్మకాల సంరంభం.

వయసు పొంగులు మాయమైన సుందరాంగుల్లా చిందరవందరై అట్ట చిరిగిన పుస్తకాలు. మిగిలిన రంగుల హంగులు వెదజల్లుతూ, ముఖచిత్రం నలిగిన గొప్ప పుస్తకాలు, పాత మాగజైన్సు.

అమ్మకం దార్ల అనౌన్స్‌మెంట్సూ, కొనుగోలు దార్ల బేరసారాలు... అదే పనిగా చూస్తున్న జనాల గుంపులు.

నూర్రూపాయల పుస్తకం ఆర్రూపాయలకే... విచిత్రం.

తెలుగు కథా మాగాణంలో జాతిరతనాలు పండించిన మహామహుల కథా సంపుటాలు కూడా కనబడుతున్నై. వాకాటి పాండురంగరావు గారి ఊహలను ఉయ్యాల లూగించిన నాటి... ఈ నాటికీ మేటి కథా సంపుటి "శివాన్విత"... అరెరె... అది కూడా ఉంది. ఎన్నో పుస్తకాల షాపులు వడబోసినా దొరకని పుస్తకం. కోతికి కొబ్బెరి బెల్లం కనబడినట్టు... గబుక్కున అందుకున్నాను.

పది రూపాయలన్నాడతడు.

బేరమాడాలన్పించలేదు.

పది రూపాయల కాయితమిచ్చేసి పేజీలు తిరగేస్తున్నాను. ఒక్క పేజీ కూడా తొలగి పోలేదు. కాకపోతే... అలిగిన అందాల భామ మోములా... కొన్ని పేజీలు ముడుచుకుపోయినై. ఇన్నర్ టైటిల్‌లో... ముత్యాల్లాంటి అక్షరాలు. "అభినందనలతో..." అది వాకాటి చేవ్రాలు. సంతకం ఆ మహారచయితదే.

ఆహా ! దీని మూల్యం... అమూల్యం. మనసు ఆనందడోలిక లూగింది. మే మాసం ఎండాకాలం పట్టపగలు ఏ.సి. థియేటర్లో ఉన్నట్టు... ఉల్లాసంతో ఊగిపోయాను.

"ఏతోట పూచెనో, ఏబోటి కోసెనో
ఈపూట ఈపూవు, ఈబాట వాలెనో...
తగని వానికి పదవి, తగిలించి నారనుచు
మెడవీడి ఈ పూవు, ఇట వాలెనేమో ...

పాట (కవిత) గుర్తుకొచ్చింది. పాపం.. ఆ మహానుబావుడీ పుస్తకాన్ని ఎవరికి బహూకరించాడో ! ఎన్ని చేతులు మారి ఈ గమ్యం చేరుకుందో !... అదో రకమైన ఆవేదన.

"అరేయ్ సురేష్ ! ఇది చూడరా."

"అవున్రా మనోహర్.. ఇది గొప్ప పుస్తకంరా .."

ఓ యువకుడు పక్కనున్న యువకునికో పుస్తకం చూపిస్తూ "ఇదో కవితా సంపుటి. ఒక్కో కవిత ఒక్కో రత్నంరా !" అంటూంటే పేజీలు మారుతున్నై. ఇది చదివి తీరాల్సిన మంచి పుస్తకంరా మనోహర్ !"

"ఏదీ... ఆ కవరు పేజీ...!"

కవరు పేజీ నాకంట బడింది. అయ్యో రామా ! అది నా పుస్తకమే. నా అంతరంగంలో కదలిన భావతరంగాలకు అక్షర రూపమిచ్చిన కవితా సంపుటి "మబ్బుల్లో చందమామ" ఇక్కడి కెట్లా వచ్చిందబ్బా ! మనసు పొరల్లో సుడులు తిరుగుతున్న బాధ తాలూకు ఆనవాళ్లు మొహమ్మీదికి రాకుండా జాగ్రత్త పడ్డం కష్టమై పోయింది.

యాభై రూపాయల కవితా సంపుటి బేరసారాల ముగింపులో ఐదు రూపాయలకు దిగింది. కాని... నా కవితల్ని అంతగా అభిమానిస్తున్న ఆ యువకిశోరాలెవరో తెలుసుకోవాలి.

"ఈ రచయిత కవితలు పుల్లారెడ్డి మిఠాయిల్లాగుంటాయిరా. ఇతని పుస్తకమొకటి ఇంతకు ముందు చదివాను. ఈ పుస్తకం దొరకలేదురా!" సురేష్ వివరణ.

ఆగలేక

"హలో సురేష్ !" నేనే పలుకరించాను.

ఆ యువకునితో పాటు సురేష్ కూడా నాముందు కొచ్చాడు. "మీరూ ..!" అతని వింత చూపులు నన్ను కింది నుంచి మీద్దాకా తడుముతున్నై.

"మీ చేతిలో ఉన్న 'మబ్బులో చందమామ' రచయితను" ఎగదన్నుకొస్తున్న సంతోషాన్ని పెదాలకు పరిమితం చేస్తున్నా. నా మాటవిని, ప్రత్యక్షంగా నన్ను చూసి వాళ్లు ఎగిరి గంతేస్తారను కున్నాం. "అట్లానా సార్ !" సురేష్ ముభావం.

పక్కనున్న మనోహర్ నా చెయ్యందుకుని కరచాలనం చేశాడు కాని సురేష్‌లో ఎలాంటి ఉత్సాహమూ లేదు.

"మీ కవితలు..." హుషారుగా వ్యాఖ్యానించబోతున్న మనోమర్ నోరు సురేష్ సైగ అందుకుని మూతపడింది.

"ఏదో... చదవాలని, ఏ ముందో చూద్దామని మీ పుస్తకం కొనేసినం." సురేష్ యధాలాపం.

అవాక్కయాను. ఏం కొంపలంటుకు పోతున్నాయనో.. రోడ్డు మీద వాహనాలు రయ్ రయ్ మనుకుంటూ అతివేగంగా.. పోటీలు పడి పరుగెడుతున్నై.

"నా కవిత్వం గురించి మీ అభిప్రాయం" కదిలించాను కావాలనే.

సురేష్ నవ్వేశాడు.

"ఆc... ఏముంది సార్. మామూలే !" పెదాలు చప్పరించాడు. మీ కవిత్వం చిత్తు కాయితాల్లో దొరికింది. చూసింద్రు గదా !" అంటూ బండి స్టార్ట్ చేశాడు. స్ప్లెండర్ బండెక్కి ఇద్దరూ చెక్కేశారు.

... మీది చెత్త కవిత్వమే... అన్నట్టు ఉందా వాలకం. ఇదేమిటి ? ఇంతకుముందే నా కవితల్ని ఆకాశానికెత్తేశాడు... నాతో అలా.. కనీసం మొహమాటానికైనా రెండు మంచిమాటలు చెప్పొచ్చుగదా ! ప్రాణం ఉసూరుమంది.

"శివాన్విత" ను గుండెలకు హత్తుకున్నాను. కోఠీలో ఉన్న మా అత్తవారింటివైపు అడుగులు పడుతున్నై. కళ్లల్లో వెలుగు, కాళ్లల్లో బలం అస్తవ్యస్తమై పోతున్నై.

నా పుస్తకం... ఫుట్‌పాత్ దాక ఎట్లా వచ్చింది ?

చెత్తకాయితాల్లో పడిందంతా చెత్త కవిత్వమేనా ?

సాహితీ స్పృహ, భావుకత లేని బండ మనుషులకు కాంప్లిమెంటరీ కాపీలివ్వడం కాని పనే. కాని... అవి రెండూ లేని ఓట్ల వేటగాళ్లను అధికారం వరిస్తే... మొహమాటం తప్పదుగదా!

గుండెల్లో గుసగుసలాడ్తున్న భావాలకు భాషాప్రవాహం తోడై పొంగుకొస్తే... కవితా ధార ఆగుతుందా ? ఆగని ధారకు అక్షరరూపమిచ్చి కావ్యకన్యగా తీర్చిదిద్దితే... ఆ కావ్య కన్య హృదయ సౌందర్యాన్ని ఆస్వాదించలేని మొరటుగాళ్లు... ఇలా... ! గుండె నరాలను మెలిపెట్టి నట్టైంది.

"ఎ్కడికెళ్లారండీ ?" బయట నుంచున్న శ్రీమతి పలుకరింపుతో బాహ్య ప్రపంచాని కొచ్చేశాను.

"సండే హాలీడే. జాలీడే గదా ! మీతో సరదాగా గడపాలని మా తమ్ముడు ఎదిరి చూస్తుంటే... మీరేమో..." కాటుక కళ్లను కందిరీగ రెక్కల్లా టపటపలాడిస్తూ లోపలికెళ్లింది.

బయట... వాకిట్లో... స్ప్లెండర్ బండి ఉంది.

అది ... ఆబిడ్స్‌లో కనబడిందే.. ఆ యువకులదే !

ఇంటి లోపలిదంతా కనబడుతూంది, వినబడుతూంది. నాకాళ్లు గడపదగ్గర ఆగిపోయినై.

"ఒరేయ్ రమేష్ ! ఈ పుస్తకం చూడరా" సోఫాలో కూచున్న మా బామ్మర్దికి మబ్బుల్లో చందమామ నందించి పక్కన కూలబడ్డాడు మనోహర్. అతని పక్కన సురేష్...

"అరె... ఇది మా బావ రాసిందిరా !" ఆశ్చర్యంతో రమేష్ కళ్లు చేటలైపోయినై... మీకెట్లా దొరికిందిరా ?"

"ఫుట్‌పాత్ మీద కొనేసినం" సురేష్ గర్వంగా చెబుతున్నాడు.

"అరెరే... పూర్‌ఫెలో మా బావ పుస్తకం ఫుట్‌పాత్ మీదికొచ్చిందా ! మా బావకు తెలిస్తే బాధపడ్తాడురా !"

"తెలియడమేందిరా ! మీ బావ ముందే కొనేసినం".

"మీ బావను మేము గుర్తుపట్టినం గాని.. మేము నీ ఫ్రెండ్సుమని మీ బావకు తెల్వదు గదరా !"

"పాపం ! ఏమన్నా ఫీలయాడా ?"

"అవడమేందీ ! తనను తాను పరిచయం చేసుకున్నాడు" మనోహర్ అదోలా నవ్వుతూ చెబుతున్నాడు.

"వీడు... ఈ సురేష్ గాడు మీ బావను గడ్లె కలిపిండు. అంత గొప్పకవి. .. గాలి దీసి పారేసిండురా"

"అంటే... !" బామ్మర్ది రమేష్ మొహం బహువర్ణ చిత్రమైంది.

"సారీరా రమేష్ ! మీ బావ కవిత్వం చాలా బాగుంటుంది. కాని... ఆ మాట అతనిముందే అంటే గర్వమొస్తుంది. గర్వం సర్వం హరిస్తుంది గదరా ! అందుకనీ..."

"తప్పురా సురేష్ !" మనోహరందుకున్నాడు. "కవికైనా, కళాకారునికైనా ప్రోత్సాహం చాలా అవసరం. అతని కృషిని మెచ్చుకుంటే.. ఆ మెప్పుకోలు గొప్ప టానిక్‌లా పంజేస్తుంది. అందుకేరా సన్మానాలు, పురస్కారాలు. అవే లేకపోతే కళలు రాణించవురా. అందులో లలిత కళలు మరీను. కళలు నశించిపోయిన దేశంలో కాకులు గద్దలూ రాజ్యమేలుతై తెలుసా ?"

"అవున్రా... !" మనోహర్ మనోగతానికి మా బామ్మర్ది స్పందన. "సాహిత్యానికి మాబావ సేవలు ప్రశంసనీయమురా..." ఇంకేదేదో చెప్పి చివరికి "యూ ఆర్ రాంగ్ మిస్టర్ సురేష్" అన్నాడు.

"అయితే... మీ బావకు సారీ చెప్తానురా !" సురేష్ వాలకం గంభీరమైంది.

నాలో ఆనందం చిందులేసింది. మానసవీణ కొత్తగా జతులు సవరించింది.

కవులూ, కళాకారుల మనస్తత్వ మిట్లా ఉంటుందా ? నన్ను నేను ప్రశ్నించుకుంటూ లోపలికి అడుగేశాను.

**ఆదివారం ఆంధ్రప్రభ**
**15 సెప్టెంబర్, 2002 న ప్రచురితమైంది**

